





వైసీపీ-టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం - హేమాద్రిని ఓదార్చుతున్న టీడీపీ నాయకులు

టీడీపీలో తిరిగితే చంపేస్తారట!

డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు బలవంతంగా టీడీపీ నేతల పేర్లు చెప్పించారు

ఇష్టానుసారం కొట్టారు.. ప్రాణభయంతో పరుగులు తీశా

వైసీపీ నేతల కిడ్నాప్ బాధితుడు హేమాద్రి ఆవేదన

పుంగనూరు, ఏప్రిల్ 17: 'పుంగనూరు వారపు సంతలో మహిళా మార్ట్ వద్ద డ్వాక్రా మహిళలతో వైసీపీ నేతలు మాట్లాడుతుండగా అక్కడికి వెళ్లాను. కొంతమంది వైసీపీ నాయకులు 'నీకు ఇక్కడేం పని' అంటూ నన్ను బలవంతంగా జానపదకళల సంస్థ రాష్ట్ర చైర్మన్ నాగభూషణం ఇంటికి తీసుకెళ్లారు. కొట్టి చొక్కా చింపారు. నోట్లో తెల్లని పౌడర్ వేసి, నిర్బంధించి దుర్భాషలాడారు. పుంగనూరు, పరిసర ప్రాంతాల్లో విద్యార్థులు, యువతకు డ్రగ్స్ విక్రయిస్తూ వారి జీవితాలు నాశనం చేస్తున్నానని, టీడీపీ నాయకులు సీవీ.రెడ్డి, పోలీసుగిరి, నాగరాజ, సుహేల్‌బాషా, సుబ్రహ్మణ్యంరాజు నాకు డ్రగ్స్ ప్యాకెట్లు ఇచ్చారని చెప్పాలని వీడియో చిత్రీకరించారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రచారంలో తిరిగినా, ప్రచారం చేసినా ఇబ్బందులు తప్పవని, చంపేస్తామని హెచ్చరించారు' అని పుంగనూరుకు చెందిన టీడీపీ కార్యకర్త హేమాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. నాగభూషణం ఇంటి వెనుక నుంచి ప్రాణభయంతో పరుగులు తీశానని తెలిపారు. గతంలో తన ఇంటి వద్దకు వచ్చి కొందరు ఇలాగే బెదిరించినట్లు తెలిపారు.

ఇరువర్గాల తోపులాటతో ఉద్రిక్తత

హేమాద్రిని వైసీపీ నేతలు నిర్బంధించిన విషయం వారి నుంచి తప్పించుకుపారిపోయిన టీడీపీ కార్యకర్త నాగరాజు ద్వారా తెలుసుకున్న టీడీపీ నేతలు పోలీస్ గిరి, సుహేల్‌బాషా, ఎం.రామకృష్ణమరాజు, సుబ్రహ్మణ్యంరాజు, నౌషాద్, సద్దాంహుసేన్, ఇమ్రాన్, గాజుల రమణ, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో నాగభూషణం ఇంటివద్దకు చేరుకున్నారు. హేమాద్రిని వదిలిపెట్టాలని డిమాండ్ చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఒకానొక సమయంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఎస్‌ఐ రఫీక్, సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని ఇరువర్గాల వారిని పక్కకు నెట్టి సర్దిచెప్పారు. టీడీపీ నేత సుహేల్ వాహనంపై వైసీపీ శ్రేణులు దాడికి దిగగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ తోపులాటలో టీడీపీ నాయకుడు నౌషాద్ చేతిపై వైసీపీ కార్యకర్త అమ్ముకుట్టి బ్లేడ్‌తో కోసినట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాయంత్రం వరకు స్టేషన్‌లోనే..

వైసీపీ నేతల నుంచి తప్పించుకున్న హేమాద్రి పుంగనూరు పోలీసు స్టేషన్‌కు చేరుకుని కిడ్నాప్, దౌర్జన్యం, డ్రగ్స్ ప్యాకెట్లు ఇచ్చి వీడియో తీయించారని సీఐ రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఉదయం 11.45 గంటలకు బాధితుడు ఫిర్యాదు చేయగా విచారణ పేరుతో సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. అలాగే వైసీపీ నేత నాగభూషణం ఇంటిపై టీడీపీ నేతలు దాడికి ప్రయత్నించారని, కొందరు కార్యకర్తలను కులం పేరుతో దుర్భాషలాడారని వైసీపీ వారు ఫిర్యాదు చేశారు.



టీడీపీ శ్రేణులను నిరోధిస్తున్న పోలీసులు

వైసీపీ దురాగతాలకు నిదర్శనం

పుంగనూరులో వైసీపీ నాయకుల దురాగతాలకు ఈ ఘటన మరో నిదర్శనం. టీడీపీ కార్యకర్త హేమాద్రి కిడ్నాప్, దాడి, డ్రగ్స్ ప్యాకెట్లతో వీడియో చిత్రీకరణ లాంటి కార్యక్రమాలకు పాల్పడటం దారుణం. ఇప్పటికే వందల మంది నేతలపై తప్పుడు కేసులు, రౌడీషీట్లు పెట్టారు. ఎస్పీ స్పందించి కిడ్నాప్ కేసు, దాడి కేసులు పెట్టాలి. పుంగనూరులో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఓటమి భయంతోనే వైసీపీ నేతలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారు.

- చల్లా రామచంద్రారెడ్డి, టీడీపీ పుంగనూరు అభ్యర్థి

ఇలా దాడులు చేస్తే ఎలా బతకాలి

వైసీపీ నాయకుల అరాచకాలు, దాడులతో పట్టణ ప్రజలు భయపడుతున్నారు. టీడీపీ కార్యకర్తలు హేమాద్రి, నాగరాజు మహిళా మార్ట్ వద్ద ఉంటే వైసీపీ నాయకులు కిడ్నాప్ చేయడం బాధాకరం. మంత్రి పెద్దిరెడ్డి ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాన్ని నిలదీసిన వారిపై రౌడీషీట్ కేసులు పెట్టించడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడమే. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి. టీడీపీ కార్యకర్తపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- సుహేల్‌బాషా, టీడీపీ మైనారిటీ నేత

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ముహూర్తాలు ఖరారు చేసుకున్న అభ్యర్థులు
- నేడు చిత్తూరు టీడీపీ ఎంపీ, చిత్తూరు, నగరి ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్లు
- చిత్తూరు, పలమనేరు, కుప్పం వైసీపీ అభ్యర్థులు కూడా..
- 22న అమరనాథరెడ్డి నామినేషన్

చిత్తూరు (ఆంధ్రజ్యోతి)/చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికల మహాసంగ్రామంలో గురువారం నుంచి తొలిఘట్టం ప్రారంభం కానుంది. ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29వరకు విత్‌డ్రాకు అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి ఇప్పటికే ముహూర్తాలను ఖరారు చేసుకున్నారు. తొలిరోజు చిత్తూరు టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, చిత్తూరు, నగరి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్ నామినేషన్ వేయనున్నారు. గురువారం నామినేషన్‌తో పాటు 24న మరోటి వేసేందుకు గురజాల ప్లాన్ చేసుకున్నారు. మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డి 19న డమ్మీ నామినేషన్ వేసి, 22న మరోటి వేయనున్నారు. చిత్తూరు, పలమనేరు, కుప్పం వైసీపీ అభ్యర్థులు విజయానందరెడ్డి, వెంకటేగౌడ, భరత్ కూడా గురువారమే నామినేషన్లను వేసేందుకు సిద్ధమయ్యారు. ఎంపీ అభ్యర్థులు కలెక్టర్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థులు లోకల్ ఆర్వోలకు నామినేషన్ పత్రాలను అందించనున్నారు. ప్రతి ఆర్వో కార్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు, బారికేడ్లను, చెక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. నిబంధనల మేరకు అభ్యర్థితోపాటు ఐదుగురికి మించి వెళ్లేందుకు వీలు లేదు. అభ్యర్థి వెంట మూడు వాహనాలను అనుమతిస్తారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఇప్పటివరకు అభ్యర్థుల ప్రచార ఖర్చులను ఆయా పార్టీల ఖాతాల్లో వేసిన ఎన్నికల సిబ్బంది, నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థుల ఖాతాల్లో వేస్తారు.

రేపు చంద్రబాబు నామినేషన్

- దాఖలు చేయనున్న భువనేశ్వరి
- నేడు కుప్పం రాక
- 20న పార్టీ శ్రేణులతో సమావేశం

కుప్పం, ఏప్రిల్ 17: కుప్పంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19వ తేదీన నామినేషన్ వేయనున్నారు. ఆయన తరపున సతీమణి భువనేశ్వరి దాఖలు చేయనున్నారు. బుధవారం సాయంత్రానికి ఆమె కుప్పం చేరుకుంటారు. రాత్రికి ఇక్కడే బస చేస్తారు. గురువారం మధ్యాహ్నం 12.33 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు పార్టీ శ్రేణులతో భారీ ఊరేగింపు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అనంతరం భువనేశ్వరి పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. 20వ తేదీ కూడా ఇక్కడే ఉండి, పార్టీలోని వివిధ శ్రేణులతో సమావేశమై ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేస్తారు. అదే రోజు సాయంత్రం కుప్పం నుంచి బయలుదేరి వెళతారు.

నిబంధనలు పాటించాలి : ఎస్పీ

చిత్తూరు, ఏప్రిల్ 17: నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ సజావుగా సాగేలా సహకరించాలని ఎస్పీ మణికంఠ చందోలు కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో వీడియోగ్రాఫర్‌లు, మొబైల్ బృందాలతో నిఘా ఉంచాలన్నారు. మూడు వాహనాలకే అనుమతి ఉందని, అభ్యర్థితోపాటు నలుగురు సభ్యులను మాత్రమే లోనికి పంపుతామని చెప్పారు. ర్యాలీలు లేదా సమావేశాలకు అనుమతి లేదని, బాణసంచా పేల్చరాదని సూచించారు.

మద్యం రవాణా చేస్తూ పట్టుబడ్డ వైసీపీ కార్యకర్త



ఎస్ఈబీ పోలీసుల అదుపులో కుప్పుస్వామి (నీలిరంగు టీ షర్ట్), సంపత్

కుప్పం, ఏప్రిల్ 17: కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తూ వైసీపీ కార్యకర్త కుప్పుస్వామి ఎస్ఈబీ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఈబీ పోలీసులు బుధవారం గుడుపల్లె వద్ద తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న కుప్పుస్వామి, సంపత్‌ను ఆపడానికి ప్రయత్నించారు. పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి రూ.30 వేలు విలువ కలిగిన 490 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యంతో సహా ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. కుప్పుస్వామిని, సంపత్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా కుప్పం మండలం చిన్నబొగ్గుపల్లె గ్రామానికి చెందిన కుప్పుస్వామి వైసీపీ కార్యకర్త. ఆ పార్టీకి సంబంధించిన సోషల్ మీడియాలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.



జగన్ ఫొటోతో వైసీపీ కండువాతో ఉన్న కుప్పుస్వామి (ఫైల్ ఫొటో)

వైభవంగా సీతారాముల కల్యాణం

భద్రాద్రిని తలపించిన కాణిపాకం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 17 : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా కాణిపాకంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అలంకార మండపం వద్ద సీతారామ హనుమంత సమేత లక్ష్మణ స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు వైభవంగా అభిషేకం, గణపతి పూజ, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం 12.08 నుంచి 12.57 గంటల మధ్య అభిజిత్ లగ్నంలో కల్యాణం నిర్వహించారు. సీతారాములకు ముత్యాల తలంబ్రాలు పోశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కాణిపాకం భద్రాద్రిని తలపించింది.



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

ఎట్టకేలకు జడ్పీ నుంచి బాలాజి రిలీవ్

చిత్తూరు రూరల్ ఏప్రిల్ 17: జడ్పీలో నోడల్ అధికారిగా పనిచేస్తున్న బాలాజీని మంగళవారం రాత్రి కలెక్టర్ షన్మోహన్ రిలీవ్ చేశారు. ఆయన్ను నెల్లూరు జడ్పీ సీఈవోకు రిపోర్ట్ చేయాల్సిందిగా పేర్కొన్నారు. జడ్పీలో నోడల్ అధికారిగా ఉన్న బాలాజి ఆ మధ్య ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. పీటీఎం ఎంపీడీవోగా ఆర్డర్స్ ఇచ్చినా జడ్పీని వీడకుండా ఏళ్ల తరబడి తిష్ట వేశారు. ఎన్నికల నేపథ్యంలో బాలాజీని నెల్లూరు జిల్లాలోని తోటపల్లి గూడూరు మండలానికి ఎంపీడీవోగా బదిలీ చేశారు. పూర్వ సీఈవో ద్వారా జిల్లాలోని వైసీపీ ముఖ్యనేత అండదండలతో నెల్లూరుకు వెళ్లకుండా జడ్పీలోనే కొనసాగినట్లు ప్రచారముంది. నెల్లూరు జిల్లాకు రావాల్సిన ముగ్గురు ఎంపీడీవోలు జాయిన్ కాకపోవడంతో అక్కడి టీడీపీ నేత సోమిరెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాగా, కొంత కాలంగా జడ్పీ సమావేశ మందిర నిర్మాణ విషయంగా విచారణ కొనసాగుతోంది. ఇందులో ఆయనకు సంబంధం లేకున్నా జడ్పీ పూర్వ అధికారి ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత అధికారి మధ్య జరిగిన వార్‌లో ఇతను పరోక్షంగా కలుగజేసుకోవడంతో ఇబ్బందులు తప్పలేదు. ఇటీవల పూర్వ అధికారి ఆదేశాలతో బాలాజి ఇంట్లో బైరెడ్డిపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేష్ సోదాలు నిర్వహించడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. దీంతో తన భర్తను జిల్లా నుంచి రిలీవ్ చేయాలని బాలాజి సతీమణి కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ క్రమంలో బాలాజీని మంగళవారం రాత్రి రిలీవ్ చేశారు. బుధవారం నెల్లూరులో రిపోర్ట్ చేశారని సమాచారం.

బాలాజీ ఇంట్లో సోదాలపై విచారణ

పలమనేరులోని జడ్పీ నోడల్ అధికారి బాలాజీ ఇంట్లో బైరెడ్డిపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేష్ సోదాలపై కలెక్టర్ జిల్లా స్థాయి అధికారితో విచారణ చేయించినట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలపాలని ఆ అధికారిని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇక విచారణ అధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా రాజేష్‌పై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

గజదాడిలో రైతుకు గాయాలు

శాంతిపురంలో జంట ఏనుగుల హల్‌చల్

తులసినాయనపల్లె పరిసరాల్లో పంట నష్టం





వరి మడిలో ఏనుగుల పాద ముద్రికలు - గజదాడిలో గాయపడిన కృష్ణమూర్తి

శాంతిపురం, ఏప్రిల్ 17: శాంతిపురం మండలం తులసినాయనపల్లె వద్ద బుధవారం తెల్లవారుజామున జంట ఏనుగులు హల్‌చల్ చేశాయి. కృష్ణమూర్తి అనే రైతు ను గాయపరిచాయి. తెల్లవారుజామున కర్ణాటక అటవీ సరిహద్దు ప్రాంతం నుంచి తులసినాయనపల్లె సమీపానికి రెండు ఏనుగులు చేరుకున్నాయి. కొటారిలో నూర్పిడికి సిద్ధంగా ఉంచిన వరి కుప్పలను తింటుండగా అక్కడే నిద్రిస్తున్న రైతు కృష్ణమూర్తి వాటిని తరిమేందుకు ప్రయత్నించాడు. ఏనుగులు అతనిపై దాడికి యత్నించాయి. తప్పించుకున్న కృష్ణమూర్తి గ్రామానికి పరుగులు తీసి, ప్రాణాలు కాపాడుకున్నారు. గాయాలు కావడంతో గ్రామస్తులు ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఏనుగులు కడపల్లె, శివరామపురం, జీడిమానుపల్లె మీదుగా పోడుబావి అటవీ ప్రాంతానికి చేరుకున్నాయి. దారిలో రాగి, వరి, టమోటా, అరటి తోటలను తిని, తొక్కి నాశనం చేశాయి. రైతులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ఆ ప్రాంతాలను సందర్శించి, పంట నష్టాన్ని అంచనా వేశారు. చికిత్స పొందుతున్న కృష్ణమూర్తిని పరామర్శించారు. రాత్రి వేళ పొలాల వద్ద ఉండరాదని రైతులకు సూచించారు.

నిప్పుల కొలిమి



చిత్తూరులో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు

శ్రీరంగరాజపురంలో 42.3, పులిచెర్లలో 42 డిగ్రీలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 17: ఎండతీవ్రత, వడగాడ్పులతో బుధవారం చిత్తూరు నగరం ఉడికి పోయింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేడి వాతావరణం కొనసాగింది. పలు మండలాల్లో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 42.3, పులిచెర్లలో 42.0 డిగ్రీలు నమోదైంది. చాలామంది ఇండ్లకే పరిమితమయ్యారు. ఫుట్‌పాత్ వ్యాపారులు, కూలీలు వడగాడ్పుల తీవ్రతకు విలవిల్లాడారు. నెలాఖరు వరకు చిత్తూరు ఉష్ణోగ్రత 41 డిగ్రీలకు మించే నమోదవుతుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

మదనపల్లె సబ్‌జైల్లో ముత్తుకూరు ఖైదీ మృతి



మొగిలప్ప మృతదేహం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17: మదనపల్లె స్పెషల్ సబ్ జైలులో రిమాండు ఖైదీ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆర్డీఓ హరిప్రసాద్ మెజిస్టీరియల్ విచారణ చేపట్టారు. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం ముత్తుకూరు వాసి పాపన్న కుమారుడు మొగిలప్ప(67) నాటుసారా విక్రయిస్తున్నాడని పోలీసులు ఈనెల 16న అరెస్టు చేసి పలమనేరు కోర్టు ఎదుట హాజరు పరచగా కోర్టు రిమాండు విధించిది. పోలీసులు మదనపల్లె సబ్ జైలుకు మంగళవారం సాయంత్రం 5.30గంటలకు తీసుకొచ్చారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పరిశీలించిన సబ్‌జైలు సిబ్బంది మొగిలప్పను జైలు బ్యారెక్‌లోకి పంపారు. కాగా బుధవారం మొగిలప్ప అపస్మారక స్థితిలో పడి ఉండడంతో జైలు సూపరింటెండెంట్ రామకృష్ణయాదవ్, సిబ్బంది అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించా రు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మొగిలప్ప మృతిచెందాడని నిర్ధారించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శనం, మాలమహానాడు నేతలు ఆస్పత్రి వద్ద మొగిలప్ప కుటుంబీకులను విచారించారు.

ఒలంపిక్స్‌లో రాణించాలి

తిరుమల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రానున్న సింగపూర్ టోర్నమెంట్‌తో పాటు ఒలంపిక్స్‌లో బాగా రాణించాలని స్వామివారిని కోరుకున్నట్లు ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఆమె దర్శించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రానున్న టోర్నమెంట్స్‌లో బాగా ఆడాలని స్వామిని ప్రార్థించానన్నారు.టీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి ఆమెకు ఈ సందర్భంగా బలరాముడి ప్రతిమను బహూకరించారు.



అట్టుంటనా!

అన్న 'ఫిగర్' చెప్పమన్నాడు



'అన్న పంపించాడు' అంటూ తమ దగ్గరకు వాళ్లు రాగానే తిరుపతి నగరంలోని వ్యాపారులు గడగడ వణికిపోతున్నారు. ఎన్నికల ఖర్చు భారీగా పెరిగిందంటూ వసూల్ రాజాలను తన తరపున రంగంలోకి దింపారని చెబుతున్నారు. నగరంలోని రియల్టర్లు, బిల్డర్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులను వసూల్ రాజాలు టార్గెట్‌గా చేసుకున్నారు. తిరుపతిలో పేరుమోసిన ఒక బిల్డర్‌కు కోటి రూపాయలు 'ఫిగర్' చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. హమ్మో.. కోటా? అని అతను ఆందోళన పడుతూ ఉంటే, మాస్టర్ ప్లాన్ రోడ్ల ఏర్పాటులో జరిగిన మేళ్లను వివరించి, భవిష్యత్తులో దున్నేసుకోవచ్చని భరోసా ఇచ్చారని తెలిసింది. ఆసుపత్రులకు అయితే, స్థాయిని బట్టి 'ఫిగర్' నిర్ణయించారు. హోటళ్లనూ ఊడ్చేస్తున్నారని అంటున్నారు. పార్టీ ఫండ్ పేరుతో కొనసాగుతున్న వసూళ్ల పర్వం ఇప్పుడు చర్చగా మారుతోంది. విశేషం ఏమిటంటే.. ఇలా వసూళ్లకు పంపే చోటా నేతలకు కమీషన్లు కూడా ఇస్తున్నారని చెప్పుకుంటున్నారు. దీంతో అన్న అనుచరగణం కొరడాలు బయటకు తీసి రంగంలోకి దిగుతున్నారని తెలిసి, కొందరు బిల్డర్లు సమ్మర్ ట్రిప్‌లకు చెక్కేస్తున్నట్టు తెలిసింది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

లీకులు...కాసులు



ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడబ్బా నాలుగు రాళ్లు ఎనకుసుకునేది.. అనుకుంటున్నారు వైసీపీ నాయకులు. నిజమే పాపం జగన్‌ను పీఠం ఎక్కించాక పథకాలకు తప్ప పనులకు పైసా ఇవ్వకపాయ. కాంట్రాక్టులు చేసుకుని నాలుగు కాసులు మిగుల్చుకునే ఆవకాశం రాకపాయ. అందుకే ఎన్నికల రోజుల్లో చిత్రమైన ఎత్తుగడ వేస్తున్నారు. ఇటీవల వడమాలపేటకు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ మారబోతున్నారనే ప్రచారం జరిగింది. దాంతో వైసీపీ పెద్దలు రంగంలోకి గబీమని దూకేశారు. ఇట్టాంటి వేళ ఇదేమి సామీ అని చెరో రెండు లక్షలు చేతల్లో పెట్టి సర్దేసినట్టు ప్రచారం జరుగుతోంది. నిజానికి వాళ్లకి పార్టీ మారే ఆలోచన లేదు. కావాలనే సోషల్ మీడియాకు టీడీపీలో చేరుతున్నట్టు లీకులు ఇచ్చారంట. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో కూడా ఇదే విధంగా కొందరు లీకులిచ్చి కాసులు రాబట్టుకున్నట్టు చెబుతున్నారు. ఇది చూసి పార్టీ మారబోతుండారంటూ లీకులు ప్రచారం చేసుకునే వాళ్ల సంఖ్య పెరిగింది. నిజమేదో, అబద్ధమేదో తెలీక పాపం నాయకులు జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు అని చెప్పుకుని జనం నవ్వుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్

పెద్ద నోటు... ఈసారి లోటు



ఎన్నికలొచ్చాయంటే నగదు, మద్యందే కీలక భూమిక. నోటిఫికేషన్ మొదలు ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లేవరకూ ఈ రెండే ప్రభావం చూపిస్తుంటాయి. ఓటర్లను దారిలోకి తెచ్చుకోవాలన్నా, ఫిరాయింపులు అడ్డుకోవాలన్నా వీటి అవసరం అంతాఇంతా కాదు. జేబులో చేయి పెట్టి నోటు తీస్తే కట్టంతా ఇవ్వాలని అడిగే రోజులివి. అభ్యర్థుల అదృష్టమో.. ఓటరు దురదృష్టమో తెలియదు గానీ గడచిన రెండు ఎన్నికల్లోనూ పెద్ద నోట్లు కనిపించకుండా పోయాయి. 2014 సాధారణ ఎన్నికల్లో పెద్ద నోటు అంటే 1000 ఒక్కటే. ఆ తర్వాత నోట్ల రద్దుతో వెయ్యి నోటు అడ్రస్ లేకుండా పోయింది. 2019 ఎన్నికల తర్వాత రూ. 2000 నోటు వచ్చింది. ఇప్పుడు ఆ నోటూ కనిపించడంలేదు. జేబులోకి చెయ్యిపోనిస్తే 500 నోటు లేదా 200 నోటు పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఓటరుకైనా నాయకుడికైనా ఇచ్చే పెద్ద నోటు ప్రస్తుతానికి ఇదే.. అలాగని ఒకటో రెండో నోట్లిచ్చినా ఓటరు సంతృప్తి పడే రోజులు పోయాయని అభ్యర్థులు ఇప్పుడు పెద్ద నోట్ల వేటలో పడ్డారు.

- డక్కిలి

సత్యవేడులో గెలిచే పార్టీదే అధికారం

● సెంటిమెంట్

సత్యవేడులో గెలిచే పార్టీ రాష్ట్రంలో అధికారం చేపడుతుందని ఒక నమ్మకం. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికలు మినహా మిగతా అన్ని ఎన్నికల్లోను ఇదే జరిగింది. 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీదే అధికారం. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.స్వరాజన్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా అప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందిన, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. 2014లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా టీడీపీ అధికారంలో ఉంది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది.

- సత్యవేడు

మాట తప్పడు, మడమ తిప్పడు
నేను వున్నాను, నేను విన్నాను
విలువలు, విశ్వసనీయత
చెప్పాడంటే.. చేస్తాడంతే

.. 'ఒక్క ఛాన్సు' అంటూ 2018 పాదయాత్ర.. 2019 ఎన్నికల ప్రచారాల్లో విపక్ష నేతగా జగన్ హామీలిస్తూ చెప్పిన మాటలివి. వీటిని నమ్మి ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చారు. మరి.. ముఖ్యమంత్రిగా ఆయన ఐదేళ్లలో తిరుపతి జిల్లాకు సంబంధించి నాటి హామీలేవీ నెరవేర్చలేదు. 'చెప్పాడంటే చేయడంతే' అన్నట్లుగా వ్యవహరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




బాలాజీ రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా చంద్రబాబు హయాంలో నిర్మించిన రాతి కట్ట

ఇంకా ఆరు నెలలు కాలేదా?

● గాలేరు- నగరి ప్రాజెక్టుకు నీళ్లొదిలేసిన జగన్ ● టెండర్లు రద్దు.. ప్రత్యామ్నాయ ప్రతిపాదనలతో సరి

అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తా.

- 2018 జనవరి 6న సదుంలో, 16వ తేదీన వడమాలపేటలో పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీ.



ప్రాజెక్టు నేపథ్యం

రాయలసీమ కరువు నివారణకు దివంగత ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపాదించిన ప్రాజెక్టుల్లో గాలేరు-నగరి ఒకటి. ఈ ప్రాజెక్టు రెండో దశలో 8 నుంచి 14 వరకు.. ఏడు ప్యాకేజీలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినవి.

ప్రయోజనం కలిగే ప్రాంతాలు

తిరుపతి రూరల్, రామచంద్రాపురం, వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, కేవీబీపురం, పిచ్చాటూరు, నాగలాపురం, నింద్ర, విజయపురం, పుత్తూరు, నగరి, నారాయణవనం తదితర 14 మండలాలు. ఈ ప్రాంతంలోని 1.035 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలి.

'కాంగ్రెస్' హయాంలో అనుమతులతో సరి

ఉమ్మడి కడప జిల్లా నుంచి శేషాచల పర్వతాలలో రెండు చోట్ల టన్నెళ్లు తవ్వాలి. మొదటి టన్నెల్ ద్వారా రేణిగుంట మండలం బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని చేర్చాలి. అక్కడ్నుంచి మల్లిమడుగు.. ఆపైన పద్మసాగర్, శ్రీనివాస సాగర్, వేణుగోపాల సాగర్, వేపగుంట, అడవి కొత్తూరు రిజర్వాయర్లను నింపాలి.దీనికోసం మల్లిమడుగు రిజర్వాయర్ సామర్థ్యం పెంచాలి. మిగిలినవి కొత్తగా నిర్మించాలి. రెండు టన్నెళ్లతో కూడిన 94 కిలోమీటర్ల ప్రధాన కాలువ, ఏడు రిజర్వాయర్ల నిర్మాణానికి 2005లో రూ.2189 కోట్ల అంచనాతో అప్పటి ప్రభుత్వం పనులు మంజూరు చేసింది. ఆ అంచనాలను 2008లో రూ.2526 కోట్లకు సవరించింది. వీటికి అనుమతి వచ్చిందే గానీ.. ఆరేళ్ల పాటు పనులు మొదలు కాలేదు.



బాలాజీ రిజర్వాయర్ వద్ద ఈ కాలువ తవ్వింది టీడీపీ హయాంలోనే

చంద్రబాబు వచ్చాక పరుగులు

2014లో చంద్రబాబు సీఎం కాగానే రూ.2526 కోట్లతో ఈ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచారు. పద్మసాగర్, శ్రీనివాస సాగర్ రిజర్వాయర్లకు ప్రైవేటు భూముల సేకరణ ముగిసింది. బాలాజీ రిజర్వాయర్ కట్ట.. అక్కడ్నుంచి మల్లిమడుగు రిజర్వాయరు వరకు కాలువ తవ్వకం పనులు మొదలయ్యాయి. మల్లిమడుగు సామర్థ్యాన్ని 0.18 టీఎంసీల నుంచి 2.65 టీఎంసీలకు పెంచేందుకు రూ.56.08 కోట్లతో పనులు మొదలు పెట్టి.. రూ.25 కోట్లు ఖర్చుపెట్టారు. రూ.160 కోట్ల అంచనాతో మొదలు పెట్టిన వేణుగోపాల సాగర్‌కూ రూ.35 కోట్ల మేరకు పనులు జరిగాయి. కాలువ సహా వేపగుంట సాగర్, అడవికొత్తూరు రిజర్వాయర్ల అంచనా వ్యయం రూ. 129.8 కోట్లు కాగా, ఇందులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. టన్నెళ్ళ నిర్మాణానికి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు రాకపోవడంతో పెండింగులో పడ్డాయి. మిగిలిన రిజర్వాయర్ల నిర్మాణానికి భూసేకరణలో అటవీ శాఖ నుంచీ అనుమతులు రావాల్సి ఉంది.

నాడు శివాలెత్తి.. నేడు నోరెత్తని వైసీపీ నేతలు

వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. గాలేరు- నగరి ప్రాజెక్టు రెండో దశ పనుల కోసం నగరి ఎమ్మెల్యే రోజా ఆందోళన నడిపారు. ఈ ప్రాజెక్టు వల్ల శ్రీకాళహస్తి నియోజకవర్గానికీ లబ్ధి ఉంది. అందుకని ఎన్నికల్లో ప్రయోజనం పొందేందుకు అప్పట్లో వైసీపీ నేత బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆందోళనలు చేపట్టారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కూడా గట్టిగా నినదించారు. తద్వారా 2019 ఎన్నికల్లో ఈ ముగ్గురూ ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో రోజా మంత్రిగాను.. కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గానూ జిల్లాలో బలమైన అధికార కేంద్రంగా మారారు. మధుసూదన్‌రెడ్డి సీఎం జగన్‌కు సన్నిహితులు. ఇక, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఉన్న పలుకుబడి చెప్పక్కర్లేదు. ఇలా ప్రాజెక్టు కోసం నాడు ఆందోళన చేసిన వారు.. మిగతా ప్రజాప్రతినిధులూ ఐదేళ్లుగా నోరు మెదపడంలేదు.



పనులు ఆగిపోవడంతో తుప్పుపట్టిన కాంట్రాక్టు సంస్థ వాహనాలు

జగన్ ఏం చేశారంటే..

అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది పట్టించుకోలేదు.ఆ తర్వాత రూ.2500 కోట్ల విలువైన ప్రాజెక్టు పనుల టెండర్లను అర్థంతరంగా రద్దు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్పు పేరిట రూ.5013 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. వీటికీ రెండున్నరేళ్లుగా అనుమతులు ఇవ్వలేదు. రద్దు చేసిన టెండర్ల స్థానంలో ఇంతవరకు రీ టెండర్లూ పిలవలేదు. ఒక్క రూపాయీ ఖర్చు పెట్టలేదు. బాలాజీ రిజర్వాయర్ సైట్ వద్ద కాంట్రాక్టు సంస్థ నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకోగా.. వాహనాలన్నీ తుప్పుపట్టిపోయాయి.

ఇదీ ఐదేళ్లలో సీఎం జగన్ సాధించిన 'గాలేరు- నగరి' ప్రాజెక్టు పురోగతి.

వర్తమానం

చంద్రగిరి సీను మారింది



వైసీపీ అభ్యర్థికీ సీనియర్ నేతలకూ నడుమ అంతరం

పెరుగుతున్న టీడీపీ గ్రాఫ్

చెవిరెడ్డి దూరమైన లోటు స్పష్టం

చంద్రబాబు స్వస్థలం... చెవిరెడ్డి వైవిధ్య రాజకీయం... వెరసి చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కానుకలు, సాయాల భారీ ఖర్చుతో నిరంతరం జనం మెప్పుకోసం ప్రయత్నించిన చెవిరెడ్డి అనూహ్యంగా తప్పుకోవడంతో నియోజకవర్గంలో పరిస్థితులు తారుమారు అయ్యాయి. తొలిసారి శాసనసభ బరిలోకి దిగుతున్న తనయుడు మోహిత్‌రెడ్డిని దగ్గరుండి గెలిపించుకునే అవకాశం చెవిరెడ్డి ఒంగోలు ఎంపీగా ఆయన పోటీ చేయాల్సిన అనివార్యతతో కోల్పోయారు. ఈ పరిణామాలన్నీ టీడీపీ అభ్యర్థిగా మరోమారు బరిలోకి దిగుతున్న పులివర్తి నానీకి కలిసివచ్చాయి. ఆయన గ్రాఫ్ విపరీతంగా పెరుగుతోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీలో పెరిగిపోతున్న అసంతృప్తి

చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. గత ఎన్నికల్లో శక్తికి మించి పనిచేసినా నిరాదరణకు గురయ్యామని వీరు ఆవేదనతో ఉన్నారు. చెవిరెడ్డి నియోజకవర్గంలో ఉన్నంతకాలం దీనిని దాచుకున్న వీరంతా ఇప్పుడు బయటపడుతున్నారు. పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారు. గత ఐదేళ్ళలో పనులు జరగకపోవడం, ఆదాయం లేకపోవడం, గుర్తింపు గానీ, పదవులు గానీ దక్కకపోవడం వంటివి కారణమవుతోంది. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీ నుంచి తప్పుకున్నప్పటి నుంచే పట్టు సడలుతూ వచ్చింది. ఎక్కువ కాలం తాడేపల్లిలో వుంటూ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోయారు. మోహిత్‌రెడ్డి వయసు తక్కువ కావడం, తొలిసారి పోటీ చేస్తుండడంతో అతని కంటే వయసులో పెద్దవారు, సీనియర్లు చొరవగా కలవలేకపోతున్నారు. దీంతో అభ్యర్థికీ, సీనియర్ నాయకులూ కార్యకర్తలకూ నడుమ అంతరం పెరిగింది. ఒంగోలుతోనే సతమతం అవుతున్న చెవిరెడ్డి చంద్రగిరిమీద ఇప్పట్లో దృష్టిపెట్టే అవకాశం లేదని తేలిపోయాక పార్టీ నీరసపడింది.

టీడీపీలోకి వలసలు

నియోజకవర్గంలో ప్రతిరోజూ ఏదో ఒక చోట వైసీపీ నుంచీ పెద్ద ఎత్తున కార్యకర్తలు, గ్రామ స్థాయి నాయకులు టీడీపీలో చేరుతున్నారు. మండల స్థాయిలో ప్రభావం చూపగలిగిన పలువురు నాయకులు వీరిలో ఉండడం విశేషం. చంద్రగిరి మండలం మాజీ జడ్పీటీసీ సరిత భర్త రమణమూర్తి, చంద్రగిరి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి , పాకాల జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఆమె భర్త బాబురెడ్డిలు, చిన్నగొట్టిగల్లులో వైస్ ఎంపీపీ సునీత, భర్త దామోదర్, రామచంద్రాపురం మండల నేత నీలకంఠ చౌదరి తదితరులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ పరిణామాలు వైసీపీని గణనీయంగా నష్టపరుస్తున్నాయి.

కాంగ్రెస్‌తో వైసీపీకి నష్టమే!

ఇక చంద్రగిరి నుంచీ ఆర్ఎంపీ వైద్యుడు వాసు కాంగ్రెస్ అభ్యర్థిగా రెండవసారి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత కంచన వేణుగోపాల్‌రెడ్డి కనుక గట్టిగా పనిచేస్తే ఆ మేరకు వైసీపీకి నష్టం కలిగే అవకాశముంది. వేణుగోపాల్‌రెడ్డికి ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పట్టుంది. ఆయన పట్టుదలగా కాంగ్రెస్ అభ్యర్థి కోసం రంగంలోకి దిగితే ఈ రెండు మండలాల్లో వైసీపీ ఓట్లు గణనీయంగా చీల్చగలరు.

పుంజుకుంటున్న పులివర్తి నాని

టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ, ఆయన సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్.. ముగ్గురూ తలోవేపు నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. నానీ గత ఎన్నికల్లో ఓడిపోయాడన్న సానుభూతి జనంలో కనిపిస్తోంది. నిదానంగా టీడీపీ బలం పుంజుకుంటున్న దృశ్యం కనిపిస్తోంది. ఇటీవల ప్రముఖ రియల్టర్ డాలర్స్ దివాకర్‌రెడ్డి కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. నానీని గెలిపిస్తే చంద్రగిరి అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో పలుచోట్ల ప్రకటించారు. మరోవైపు జనసేన, బీజేపీ పార్టీలు తమ పరిధిలో పూర్తి స్థాయిలో టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నాయి. తాజాగా బుధవారం వంగవీటి రాధా చంద్రగిరికి వచ్చి బలిజ సామాజికవర్గంతో సమావేశమై ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి వేలాదిగా బలిజలు హాజరు కావడం చూస్తే ఆ సామాజికవర్గం కూడా గణనీయమైన స్థాయిలో టీడీపీకి మద్దతిస్తున్నట్టు భావించాల్సి వస్తోంది. ఈ అంశాలన్నీ టీడీపీకి సానుకూలతలను పెంచుతున్నాయి.



ఇంటి నుంచే ఓటు

- 32,421మందికి అవకాశం
- దివ్యాంగులు, 85 ఏళ్లు దాటినవారికి పోస్టల్ బ్యాలెట్
- ఫారం-12డీ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 17: దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇటువంటి వారు జిల్లాలో 32,421మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా ఎన్నికల అధికారులకు 12డీ దరఖాస్తు చేసుకుంటే ఈ సౌలభ్యం కల్పిస్తారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 17,94,733 మంది (పురుషులు 8,74,738మంది, మహిళలు 9,19,817మంది) ఓటర్లు ఉన్నారు. వీరిలో.. దివ్యాంగ ఓటర్లు 24,481 మంది, 85 సంవత్సరాలు దాటినవారు 7,940మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులోనూ వందేళ్లు పైబడిన వారు 20మంది ఉన్నారు. వీరికి ఇంటి నుంచే ఓటు వేయడంపై అవగాహన కల్పించడానికి హోం ఓటింగ్ నోడల్ అధికారిగా భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమల్లీశ్వరరావును జిల్లా ఎన్నికల అధికారి నియమించారు.

దరఖాస్తు చేయడమిలా..

అర్హులైన దివ్యాంగులు, వృద్ధుల ఇంటికే వెళ్లి ఫారం- 12డీని ఎన్నికల అధికారులు అందజేస్తారు. ఈ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్వోలకు ఇస్తే.. వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందజేస్తారు. దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాకే అర్హులైన ఓటర్ల ఇంటికి పోస్టల్ బ్యాలెట్‌ను పంపుతారు. వీరిలో ఎవరైనా తాము పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేస్తామని చెబితే ఫారం-12డీ ఇవ్వరు.

రహస్య పద్ధతిలోనే ఓటింగ్

ఓటర్ల నివాసానికి ఎన్నికల సిబ్బంది వ్యాన్‌లో చేరుకుంటారు. ఇద్దరు పోలింగ్ అధికారులు, ఓ వీడియోగ్రాఫర్, పోలీస్‌శాఖ నుంచి ఒకరుంటారు. అక్కడ ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. అధికారులు నిర్దేశించిన పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లో రహస్యంగా ఓటు వేసి, దాన్ని బ్యాలెట్‌బాక్సులో ఓటరు వేసేలా చర్యలు తీసుకుంటారు. ఎవరికి ఓటు వేశారన్న విషయాన్ని తప్ప, మిగిలిన ప్రక్రియనంతా అధికారులు చిత్రీకరిస్తారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చిత్తూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొద్ది మొత్తం నగదు తీసుకుని వెళ్లాలన్నా జనం జంకుతున్నారు. బిల్లులు, ఆధారాలు చూపకుంటే ఇంతేసంగతులు. అధికారులు సీజ్ చేసేస్తున్నారు. 2014, 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి విపరీతమైన నిఘా పెరిగింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 233 కేసులు నమోదు చేసి రూ.1.60 కోట్లు స్వాధీనం చేసుకున్నారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత రెండు ఎన్నికలతో పోల్చుకుంటే కేసుల సంఖ్య పెరిగింది. కోడ్ నేపథ్యంలో డబ్బుతో పాటు మద్యం, బంగారం వంటి ఇతర సామగ్రిని కూడా రికార్డులు లేకుంటే

ఆధారం లేకుంటే గుండె గు'బిల్లు'

- ఎన్నికల వేళ పట్టుబడుతున్న నగదు
- ఇప్పటివరకు రూ.1.60 కోట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకుంటున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళితే ఆధారాలు చూపించాల్సి ఉంది. రూ.రెండు లక్షలకు మించితే ఎన్నికల విభాగంలోని రెవెన్యూ, పోలీసు అధికారులు లోతుగా పరిశీలిస్తారు. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల మధ్య ఉంటే జిల్లా ఎన్నికల అధికారులు నియమించే కమిటీ ముందుకు వెళ్తుంది. కమిటీ ఎదుట యజమాని హాజరై సరైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కమిటీ సంతృప్తి చెందితే నగదు అప్పగిస్తుంది. లేకుంటే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రూ.10 లక్షలకు మించి స్వాధీనం చేసుకుంటే ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఆ నగదు సీజ్ చేసిన అధికారులు బాధ్యులకు నోటీసులు జారీ చేస్తారు. వారిచ్చే సమాధానాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి చర్యలు తీసుకుంటారు.

గత ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ

నగదు మాత్రమే కాదు. గడియారాలు, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు వంటి వాటితో పాటు కుక్కర్లు, క్రికెట్ కిట్లు వంటి బహుమానాల విలువ రూ.10 వేలకు మించితే పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. వ్యాపార నిమిత్తమైతే రికార్డులు చూపిస్తే తిరిగి అప్పగిస్తారు. లేకుంటే సీజ్ చేస్తారు. ఓటర్ల ప్రలోభానికని ఆధారాలు లభిస్తే కేసు నమోదు చేస్తారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తారు. 2014 ఎన్నికల్లో 66 కేసులు, 2019లో 116 కేసులు నమోదయ్యాయి. ఈసారి స్వల్ప వ్యవధిలోనే 223 కేసులు పెట్టారు. పోలింగ్ నాటికి ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

గత ఎన్నికల్లో నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	పట్టుబడిన నగదు	మద్యం, బంగారం, డ్రగ్స్ వంటివి	మొత్తం విలువ	నమోదుచేసిన కేసులు
2014	రూ.11 లక్షలు	రూ.13 లక్షలు	రూ.23 లక్షలు	66
2019	రూ.5 లక్షలు	రూ.రూ.6.33 కోట్లు	రూ.6.38 కోట్లు	116
2024 (ఇప్పటివరకు)	రూ.1.19 కోట్లు	రూ.41 లక్షలు	రూ.1.60 కోట్లు	223

- 2014లో రూ.10 లక్షలు, 2019లో రూ.2 కోట్లు, ఈసారి రూ.20 లక్షలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- 2014లో డగ్స్, మత్తు పదార్థాలు వంటివి లభించలేదు. 2019లో రూ.6 లక్షలు, తాజాగా రూ.4 లక్షలు విలువ చేసేవి పట్టుకున్నారు.
- 2019లో 12657 గ్రాముల బంగారం, 60 డైమండ్స్, 43970 గ్రాముల సిల్వర్, స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.17 కోట్లు. తాజాగా రూ.14 లక్షలు విలువ చేసే 14 కిలోల రోల్డ్ గోల్డ్, 14.8 కిలోల సిల్వర్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- 2014లో రూ.2లక్షలు, 2019లో రూ.9 లక్షలు, ఇప్పుడు రూ.3 లక్షలు విలువ చేసే బహుమతుల్ని స్వాధీనపరచుకున్నారు.
- కోడ్ అమల్లోకి రాకముందు మార్చి 5న నగరి మండలం తడుకుపేట చెక్‌పోస్టు వద్ద రూ.3.98 కోట్ల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోజాకు.. ఎదురుగాలి!

- అసమ్మతి, అసంతృప్తితో ఉక్కిరిబిక్కిరి
- ప్రభుత్వ వ్యతిరేకతకు తోడైన స్వపక్షీయుల కాక
- మరోపక్క చేరికల సమరోత్సాహంతో టీడీపీ

రెండుసార్లు స్వల్ప తేడాతో ఓటమితో ఉన్న టీడీపీలో గెలవాలన్న కసి కనపడుతోంది. ఆ దిశగా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మరోవైపు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రోజా.. అసంతృప్తి, అసమ్మతులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనికి ప్రభుత్వ వ్యతిరేకతా తోడవడంతో నియోజకవర్గంలో వైసీపీకి ఎదురు'గాలి' వీస్తోందని పరిశీలకులు భావిస్తున్నారు.

- పుత్తూరు అర్బన్/ నగరి

గత ఎన్నికల్లో ఉన్న ఉత్సాహం వైసీపీ శ్రేణుల్లో ఈదఫా కనిపించడం లేదనే మాటలు వినబడుతున్నాయి. గత రెండు ఎన్నికల్లో బొటాబొటీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన రాష్ట్ర మంత్రి రోజా హ్యాట్రిక్ కోసం ఆశలు పెట్టుకున్నారు. అయితే రెండుసార్లు పోరాడి ఆమెను గెలిపించిన కీలక నాయకులు ఈసారి ముఖం చాటేస్తున్నారు. ఆమెకు వైసీపీ అభ్యర్థిత్వం దక్కకుండా అధిష్ఠానం వద్ద తుదివరకు పోరాటం



చేసిన అసమ్మతి నాయకులు ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నా.. రోజాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో మొదలియార్ ఓటర్లను ప్రభావితంచేసే వైసీపీ నాయకుడు ఏలుమలై మొదలియార్ (అమ్ములు), వడమాలపేట జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, క్షత్రియ సామాజికవర్గంలో పట్టున్న విజయపురానికి చెందిన లక్ష్మీపతిరాజు, పుత్తూరుకు చెందిన రవిశేఖర్‌రాజు, నిండ్ర మండలం కొప్పేడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డివారి భాస్కర్‌రెడ్డి తదితరులు రోజాపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారాన్ని కుటుంబసభ్యుల నెత్తిన పెట్టిన మంత్రి రోజా అలకలు తీర్చడం, బుజ్జగింపులు, సర్దుబాట్లతో బిజీగా గడిపేస్తున్నట్లు తెలుస్తోంది.

దూకుడు మీదున్న టీడీపీ

మరోవైపు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ప్రచార పర్వంలో దూసుకెళుతున్నారు. ఏడాదిగా ఆయన వివిధ కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ వెళ్తున్నారు. 'మీతో మీ తెలుగుదేశం', 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పుత్తూరులో ఇటీవల అధినేత చంద్రబాబునాయుడు పాల్గొన్న ప్రజాగళం సభ అంచనాలకు మించి సూపర్ సక్సెస్ కావడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగింది. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి చేరే వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండడం అనుకూల అంశంగా మారుతోంది. వైసీపీకి పట్టున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు, కార్యకర్తలను తనవైపు తిప్పుకోవడంలో గాలి భానుప్రకాష్ సఫలమయ్యారు. నామినేషన్ల పర్వం జోరందుకునే క్రమంలో వైసీపీ నుంచి కీలక నాయకుల చేరికలకు భానుప్రకాష్ స్కెచ్ వేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.



పెరిగిన వలసలు

గత రెండు ఎన్నికల్లో వైసీపీ గెలవడానికి ప్రధాన కారణమైన వడమాలపేట మండలంలో టీడీపీ అనూహ్యంగా పుంజుకొంది. టీసీ అగ్రహారం, తట్నేరి, కాయం పంచాయతీల్లో వైసీపీ నుంచి కీలక నాయకులు టీడీపీలో చేరారు. యాదవ సామాజికవర్గంలో పట్టున్న ఎస్‌బీఆర్ పురానికి చెందిన మాజీ సర్పంచ్ గెడ్డం సుబ్రమణ్యం యాదవ్, విజయపురం మండలంలో జగన్నాథపురం, కోసలనగరం, పాతార్కాడు పంచాయతీలకు చెందిన సోమశేఖర్, మునికృష్ణ, సర్పంచ్ నారాయణరాజు, పుత్తూరు మున్సిపాలిటీ తొలి చైర్మన్, దళితనాయకుడు అంకయ్య, అదే సామాజికవర్గానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు భువనేశ్వరి, జాన్ కెనడీ, అంబేడ్కర్ ట్రస్ట్ భవనం కోశాధికారి, రిటైర్డ్ టీచర్ కుప్పయ్య, బలిజ సంఘం పూర్వ అధ్యక్షుడు, శివాలయం మాజీ చైర్మన్ జలకం సునీల్ కుమార్, నగరికి చెందిన వైసీపీ నాయకుడు కేజే కుమార్ ముఖ్య అనుచరులైన శ్రీనివాసన్, నెడుంజయ్, దేశమ్మ దేవాలయం మాజీ చైర్మన్ బాబురెడ్డి, తడుకుపేటకు చెందిన మోహన్‌రావు తదితర నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

వైసీపీలో కాంగ్రెస్ కలవరం



మరోవైపు కాంగ్రెస్ కూడా రేసులోకి వస్తోంది. ఆ పార్టీ తరపున పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి పోటీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నగరి, పుత్తూరులో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సభలను విజయవంతం చేయడంతో ఈ దఫా కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామం కూడా వైసీపీ క్యాంపులో ఆందోళన కలిగిస్తోంది. నామినేషన్ల పర్వంతో నగరి రాజకీయం హాట్‌హాట్‌గా మారనుంది.

● కోడ్ ఉల్లంఘన

డీఈవో కార్యాలయం ముందు 'సిద్ధం'



ఎన్నికల కోడ్ ఉంటే మాకేంటి? నిబంధనలు ఉల్లంఘిస్తే మమ్మల్ని అడిగేదెవరని వైసీపీ నేతలు అనుకున్నారేమో? ప్రభుత్వ కార్యాలయాల ముందు ఎటువంటి రాజకీయ ప్రచార బ్యానర్లు పెడుతున్నారు. చిత్తూరులోని ఎమ్మెస్సార్ సర్కిల్ సమీపంలోని డీఈవో కార్యాలయం ముందు సీఎం జగన్ ఫొటోతో ఉన్న సిద్ధం బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని అధికారులూ పట్టించుకోకపోవడం స్థానికుల నుంచి తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- చిత్తూరు సిటీ

ఆయనొస్తానంటే.. మేము వద్దంటాం

ఆయన 90వ దశకంలో టీడీపీ నేతగా రామకుప్పం మండలంలో ఒక వెలుగు వెలిగారు. ఎంపీపీగా, జడ్పీటీసీగా పనిచేశారు. నియోజకవర్గ నేతలపై కినుక వహించి 2010-14 మధ్య స్తబ్దుగా ఉండిపోయారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబును కలిశారు. 2014 ఎన్నికల్లో తాను సీఎం కాగానే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇస్తానంటూ పార్టీ అధినేత హామీ కూడా ఇచ్చారట. ఏమైందో ఏమో గానీ, కొంతకాలానికే ఆయన వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. బీసీ సామాజిక వర్గ నేతగా 2014, 2019 ఎన్నికల్లో కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో వైసీపీ తరపున ప్రచారం చేశారు. 2014లో వైసీపీ అధికారంలోకి రాకపోయినా ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉన్నారు. 2019లో అధికారంలోకి రావడంతో తనకు ప్రాధాన్యం గల నామినేటెడ్ పదవి వస్తుందని, ఈ మేరకు పార్టీలోని పెద్ద నేతలు హామీ ఇచ్చారని అందరికీ చెప్పుకొన్నారు. ఐదేళ్ల వరకు నిరీక్షించినా.. పదవి రాలేదు. ఈ బాధ ఒకవైపు.. వైసీపీ పాలనపట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో ఈసారి టీడీపీ అధికారంలోకి వస్తుందన్న భావనతో ఆ పార్టీ తలుపులు తట్టారు. నియోజకవర్గ కార్యాలయానికి వెళ్లి.. తాను సొంతగూటికి వస్తానని చెప్పారట. ఈయన రావడం వల్ల లాభంకన్నా.. నష్టమే ఎక్కువంటూ టీడీపీ నేతలు, సొంత పంచాయతీ శ్రేణులు పార్టీ అధిష్ఠానానికి తెలిపారు. పార్టీలోకి చేర్చుకోవద్దంటూ కుండబద్దలు కొట్టడంతో ఆయన చేరిక ఆగింది. టీడీపీలో చేరేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు తెలియడంతో వైసీపీ నేతలూ ఆయన్ను పట్టించుకోవడం మానేశారు. ఈ క్రమంలో ఆయన రాజకీయ భవిష్యత్తు ఎలా ఉంటుందో?

- రామకుప్పం

- షర్మిల సభలతో వైసీపీలో ఆందోళన
- 4 నియోజకవర్గాల్లో బలమైన ప్రభావం
- వైసీపీ ఓట్లను పెద్దఎత్తున చీల్చే అవకాశం

ఆ నలుగురూ...



జిల్లాలో వైసీపీకి కొత్త భయం పట్టుకుంది. ఇప్పటికే టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిగా ఏర్పడి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుంటే తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటనకు లభించిన ఆదరణ చూసి అధికార పార్టీ నేతలు తల పట్టుకుంటున్నారు. తమకు పడాల్సిన ఓట్లు కాస్తా కాంగ్రెస్ అభ్యర్థులకు మళ్లిపోతాయని కలవరపడుతున్నారు. ఏపీ న్యాయ్ యాత్ర పేరుతో ఆమె ఇటీవల పుత్తూరు, కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం పట్టణాల్లో రోడ్ షో నిర్వహించారు. ఊహించని రీతిలో ఆమెకు జనాదరణ దక్కింది. షర్మిల సూటిగా సంధించిన విమర్శనాస్త్రాలకు స్పందన లభించింది. దీంతో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

ఓట్లలో కోత పడినట్టేనా..

వైఎస్సార్ బిడ్డ షర్మిల.. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడం జిల్లా వైసీపీకి నష్టం కలిగించే అంశమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రతి వేదిక మీదా ఆమె ప్రభుత్వ, జగన్ వైఫల్యాలను గట్టిగా ఎండగట్టారు. హామీల అమలు మరచిన తీరునూ గుర్తు చేశారు. నగరి, పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు కాంగ్రెస్ అభ్యర్థులు రాకేష్‌రెడ్డి, ఎంఎస్ బాబు, శివశంకర్, రమేష్‌బాబు తమ నియోజకవర్గాల్లో కొంత ప్రభావితం చేయగలిగినవారే. పూతలపట్టు నియోజకవర్గంలో ఎంఎస్ బాబు సిటింగ్ ఎమ్మెల్యేగా తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కచ్చితంగా పెద్దఎత్తున వైసీపీ ఓట్లను చీల్చేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇప్పటికూ బంగారుపాళ్యం మండలంలోని పలువురు మైనార్టీలు కాంగ్రెస్‌లో చేరారు. జీడీ నెల్లూరులో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ బాబు గత ఎన్నికల్లో మేనమామ, డిప్యూటీ సీఎం నారాయణస్వామి గెలుపు కోసం శ్రమించారు. నియోజకవర్గంలో పరిచయాలు, పట్టున్న నాయకుడు. నారాయణస్వామి వ్యతిరేక వర్గాన్ని తనవైపు మళ్లించుకుని వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని ఇరకాటంలో పడేస్తారని భావిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో శివశంకర్ ప్రతి మండలంలోనూ తన టీమ్ ద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్నారు. ఈ ముగ్గురూ డబ్బును కూడా ఖర్చు చేసి వైసీపీ అభ్యర్థుల ఓటమికి పని చేసేందుకు సమాయత్తమవుతున్నారు. నగరి కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్. ఈయన తండ్రి ప్రభాకర్‌రెడ్డి సీనియర్ కాంగ్రెస్ లీడర్. మాజీ మంత్రి చెంగారెడ్డి అనుచరులు కూడా. పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2019 ఎన్నికల్లో జిల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థులలో రాకేష్‌రెడ్డికే ఎక్కువగా (3357) ఓట్లు పోలయ్యాయి. ఈసారి కూడా వైసీపీ ఓట్లను చీల్చే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల్లోపు షర్మిల మరోసారి మిగిలిన నియోజకవర్గాల్లోనూ పర్యటిస్తారనే సమాచారంతో వైసీపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



ఇంత బతుకూ బతికి!



ఇటీవల ఒక ధర్నా సందర్భంలో భరత్ పక్కనే ఒదిగి కూచున్న సుబ్రమణ్యంరెడ్డి (ఫైల్ ఫొటో)

అయ్యయ్యో.. ఇట్టా అయిపోయిందేందప్పా ఈయప్ప పరిస్థితి అని కుప్పం వైసీపీ ప్రచారాల్లో ఆయనను చూసిన వారంతా విచారపడుతూ ఉన్నారు. ఎం.సుబ్రమణ్యంరెడ్డి ఒకప్పుడు వైఎస్సార్ హయాంలో చిత్తూరు జడ్పీ చైర్మన్‌గా చేశారు. ఆదేమన్నా అల్లాటప్పా పదవా.. జిల్లాకే పెద్ద పదవి. 1999, 2004, 2009 ఎన్నికల్లో కుప్పంలో ఏకంగా చంద్రబాబుపైనే కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఓడిపోయినా చంద్రబాబును సవాలు చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉండేది. ఆ తర్వాత ఆయన వైసీపీలో చేరారు. తండ్రి వైఎస్ లాగే కొడుకూ 2014లో తనకే టికెట్ ఇస్తాడని ఆశపడ్డారు. భంగపడ్డారు. రాజకీయ వైరాగ్యంతో అలికిడి లేకుండా ఉండిపోయిన ఆయన 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. పీకేఎం ఉడా (పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా ఎన్నికల ముందు ఓ రెండుమూడు నెలలు వెలిగారు. చంద్రబాబు గెలుపుకోసం ప్రచారమూ కాస్తంత ఉధృతంగానే చేశారు. కానీ దురదృష్టం వెన్నాడింది. టీడీపీ ప్రతిపక్షంలో కూచుంది. మళ్లీ రెడ్డిగారు వైరాగ్యంతో తిరుపతి చెక్కేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాయి కదా. జగన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఆయన చేతులమీదుగా వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే వైసీపీలో ఆయనకంటూ ప్రత్యేక స్థానం లేనట్టుంది. ప్రచారాల్లో ఇప్పుడు ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి తిరుగుతూ, ఆయన పక్కనో, లేదా వెనుకనో ఒదిగిపోయి ఫోటోల్లో కనిపిస్తున్నారు. వైసీపీ టికెట్ కోసం ఒకప్పుడు భరత్ తండ్రి చంద్రమౌళితో పోటీపడి నిరసన సభలు, సమావేశాలు సైతం నిర్వహించి సవాలు చేసిన సుబ్రమణ్యంరెడ్డికి ఇప్పుడీ స్థితి ఏమిటా అని జనం అనుకుంటున్నారు.

- కుప్పం

అమ్మో.. బులుగు బ్యాచ్



బుధవారం.. టీడీపీ కండువా కప్పుకొంటూ -వారం కిందట వైసీపీ నేతలు కప్పిన కండువాతో మల్లికార్జున

కనపడితే చాలు.. వైసీపీ కండువా వేసేస్తున్నారు. ఇలా కండువా కప్పుకొన్న వాళ్లంతా లబోదిబోమంటున్నారు. ఇలా చౌడేపల్లె మండలం బత్తలాపురరంలో వారం కిందట ఇంటింటి ప్రచారానికి వచ్చిన వైసీపీ నేతలు తనకు కండువా కప్పారని మల్లికార్జున బుధవారం వాపోయారు. తాను 30 ఏళ్లుగా టీడీపీలో ఉన్నానని, ఇంకా కొనసాగుతానని చెప్పారు. అందుకనే రాజంపేట టీడీపీ నేత వెంకటరమణ చేతుల మీదుగా మళ్లీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు చెప్పారు. ఇటీవల శాంతిపురం మండలంలోనూ మీటింగుకని పిలిచి ఓ మహిళకు వైసీపీ కండువా కప్పారు. ఈ పరిణామంపై ఆమె రోదిస్తూ.. మళ్లీ టీడీపీలో చేరారు. ఈనెల 11న వ్యవసాయ పనులకు వెళుతున్న తమకు వైసీపీ వారు కండువా కప్పారంటూ పలమనేరు మండలం కురప్పల్లికి చెందిన ఆవేదన వ్యక్తంచేశారు. మరునటి రోజు వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఈ పరిణామాలను చూసి 'అమ్మో.. బులుగు బ్యాచ్' అంటూ జనం హడలిపోతున్నారు.

- పుంగనూరు/చౌడేపల్లె

హనుమంతరాయ.. ఆదుకోవయ్యా!



● సెంటిమెంట్

పుంగనూరు నియోజకవర్గంలోని రాజకీయ నాయకులు ఎన్నికల ప్రచారాలు, నామినేషన్ల దాఖలు సమయాల్లో ముందుగా హనుమంతురాయదిన్నె ప్రసన్న ఆంజనేయస్వామి అనుగ్రహం కోసం పూజలు చేసి కార్యక్రమాలు మొదలు పెట్టడం సెంటిమెంట్‌గా మారింది. పుంగనూరు నుంచి రామసముద్రం వెళ్లే మార్గంలో శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో ఈ ఆలయం ఉంది. పుంగనూరుకు దేవమూల(రాశిమూల), నైరుతిలో ఆలయం ఉండడమే ఈ సెంటిమెంట్‌కి కారణం. నామినేషన్ దాఖలు సమయాల్లో ఆలయంలో పూజలు చేసి ర్యాలీగా వెళ్లి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తారు. ఇప్పటికే చల్లా రామచంద్రారెడ్డి (టీడీపీ), పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (వైసీపీ), బోడే రామచంద్ర యాదవ్(భారత చైతన్య యువజన పార్టీ)లు ఆంజనేయస్వామికి పూజలు చేసి ఎన్నికల ప్రచారాలు ప్రారంభించారు.

- పుంగనూరు

పచ్చటి పొలాల్లో వీర హనుమాన్



కుప్పం, ఏప్రిల్ 17: కుప్పంలోని పచ్చటి పొలాలలో బుధవారం వీర హను మాన్ ప్రత్యక్షమయ్యాడు. శ్రీరామనవమి పర్వ దినాన్ని పురస్కరించుకుని కుప్పానికి చెందిన కళాకారుడు పురుషోత్తం 25 ఇంటు 20 అడుగుల అతిపెద్ద క్యాన్వాస్‌పై రామబంటు హనుమాన్ చిత్రాన్ని వేసి పచ్చటి పొలాలలో ప్రదర్శించారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ చిత్రాన్ని చూసిన నియోజకవర్గ ప్రజలు అబ్బురపడుతున్నారు. చిత్రకారుడు పురుషోత్తంపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో వైసీపీ గల్లంతు


మహిళలకు సూపర్‌సిక్స్ కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, ఏప్రిల్ 17: చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ఎన్నికల్లో వైసీపీ గల్లంతు కావడం ఖాయమని రాజంపేట పార్ల మెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ సుబ్బారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం రాజులపల్లి పంచాయతీలో బుధవారం మండల టీడీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుంగనూరు ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని ఆశీర్వదించాలన్నారు. టీడీపీ నాయకులు సుబ్రమణ్యం నాయుడు, బండ్ల కిరణ్, సునీల్, నరేంద్ర, యర్రయ్య, రామచంద్ర, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించుదాం: టీడీపీ


చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్న లక్ష్మీపురం ప్రజలు

రామకుప్పం, ఏప్రిల్ 17: అస్తవ్యస్త విధానాలు, అరాచకాలతో ప్రజల కష్టాలను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి కోరారు. బుధవారం రాత్రి ఆయన స్థానిక నాయ కులతో కలిసి బందార్లపల్లె పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో శంఖారావం కార్యక్రమంలో మాట్లాడారు. కుప్పంలో ప్రజలంతా చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ల కేంద్రం వద్ద పటిష్ట భద్రత

కుప్పం, ఏప్రిల్ 17: నామినేషన్ల కేంద్రమైన తహసీల్దారు కార్యాలయం వద్ద పటిష్ఠమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు వాహనాలకు, ప్రజలకు అనుమతి లేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉందని తెలియజేశారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దారు హరికుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో ప్రతి ఒక్కరికీ గౌరవం: చల్లా బాబు

రొంపిచెర్ల, ఏప్రిల్ 17: తెలుగుదేశం పార్టీ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ గౌరవం, గుర్తింపు ఉంటుందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం రొంపిచెర్లలోని పార్టీ కార్యాలయంలో చౌడేపల్లి, రొంపిచెర్ల మండలాలకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. చౌడేపల్లి మండలం కాగతికి చెందిన వైసీపీ నాయకులు సుబ్రమణ్యంనాయుడు, రామూర్తి, సుధాకర, నాగిరెడ్డితో పాటు వారి అనుచరులు, రొంపిచెర్ల మండలం చిచ్చిలివారిపల్లె పంచాయతీ ముంతావారి పల్లెకు చెందిన వైసీపీ నాయకుడు ముంతాహరినాథరెడ్డి, నడింపల్లెకు చెందిన దాములకు చల్లాబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వేణుగోపాల్‌రెడ్డి, రవికుమార్‌నాయుడు, జనార్ధన్ పాల్గొన్నారు.

చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించండి

వచ్చే ఎన్నికల్లో చల్లా రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి సుప్రియారెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఉదయం రొంపిచెర్లలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేశారు. తర్వాత కుమార్తె చల్లా పూజితారెడ్డితో, టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు టీడీపీ హయాంలోనే మంచి జరుగుతుందని తెలియజేశారు. చల్లాబాబు మీ ఇంటి వాడని మీకు ఏ కష్టం వచ్చినా మీకు అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజాద్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, నాగిశెట్టిరామమూర్తి, రఫీ, అబూబకర్, కరీముల్లా, మస్తాన్, అష్రఫ్, మహదాలి, బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

చౌడేపల్లె: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి తెలియజేశారు. చౌడేపల్లెలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమం అందాలన్నా, అభివృద్ధి చెందాలన్నా ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. దౌర్జన్యం పోయి ప్రజలు ప్రశాంతంగా జీవించడానికి పుంగనూరు ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరమణరాజు, చంద్రవదనమ్మ, గువ్వల రమేష్‌రెడ్డి, ప్రదీప్‌రాజు, విజయలక్ష్మీ, హరిప్రసాద్, కార్తీక్, మహ్మద్‌గని, భోజనాల రెడ్డి, బోయకొండ సుబ్బు, అమీద్‌ఖాన్, బీజేపీ నాయకులు చిన్ని కిషోర్, ప్రవీణ్‌కుమార్, మనోహర్, జనసేన నాయకులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన రొంపిచెర్ల వైసీపీ నాయకులు


చౌడేపల్లెలో ప్రచారం చేస్తున్న చల్లా బాబు సోదరి వీణారెడ్డి


రొంపిచెర్లలో ఇంటింటి ప్రచారంలో చల్లాబాబు సతీమణి సుప్రియారెడ్డి, కుమార్తె పూజితారెడ్డికి ఘనస్వాగతం పలికిన టీడీపీ నాయకులు

చంద్రబాబు నామినేషన్‌కు తరలిరండి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామకుప్పం/ కుప్పం, ఏప్రిల్ 17: ఈ నెల 19న శుక్రవారం మధ్యాహ్నం టీడీపీ అధినేత చంద్రబాబు తరఫున ఆయన సతీమణి భువనేశ్వరి నామినేషన్ దాఖలు చేయనున్నారని ఆ పార్టీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్‌లు తెలిపారు. బుధవారం వారు రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో తెలుగు యువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, మహ్మద్‌రఫీ, కృష్ణానాయక్ పాల్గొన్నారు. ● చంద్రబాబు తరఫున ఆయన సతీమణి భువనేశ్వరి వేయనున్న నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. కుప్పంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్డీయే కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పాతకక్షలతో దాడి

పుంగనూరు రూరల్, ఏప్రిల్17: పాత కక్షలతో తల్లీకుమారుడిపై దాడిచేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని ఈడిగపల్లెకు చెందిన మంజునాథ్‌కు అదే గ్రామానికి చెందిన రఘు కుటుంబాల మధ్య కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పొలం నుంచి ఇంటికి వస్తున్న మంజునాథ్, ఆయన తల్లి శాంతమ్మలపై రఘు, ధనమ్మ, ముఖేష్ దాడిచేసి గాయపరిచారు. మంజునాథ్ గాయపడటంతో కుటుంబసభ్యులు అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియాను ఇంటికి సాగనంపండి


విలేకరులతో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

చౌడేపల్లె, ఏప్రిల్17: ల్యాండ్, శాండ్, మైనింగ్ మాఫియా ప్రభుత్వమైన వైసీపీని ఇంటికి సాగనంపి అభివృద్ధి, సంక్షేమం, ప్రశాంత జీవనం కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోన్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దోచుకో... దాచుకో... ధరలు పెంచుకో అన్నట్లు వైసీపీ ప్రజలను దోపిడీ చేస్తోంద న్నారు. విద్యుత్ చార్జీలను ఏడుసార్లు పెంచిందన్నారు. చెత్తపై పన్ను వేసి చరిత్రహీనుడిగా జగన్ నిలిచారని పేర్కొన్నారు. కేంద్ర పథకాలకే పేర్లు మార్చి తాము పథకాలు అందిస్తున్నట్లు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రూ.3వేల కోట్లతో రైతుల కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఉపాధి నిధులతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ఇక జే బ్రాండ్ మద్యంతో ప్రజల ప్రాణాలను వైసీపీ హరిస్తోందని ధ్వజమెత్తారు. అభివృద్ధి అంటే తెలియని వైసీపీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కోరారు. ఎంపీగా కిరణ్ కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు చిన్ని కిషోర్, గంధోడి ప్రవీణ్, మనోహర్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

సోమల, ఏప్రిల్ 17: ఉమ్మడి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కందూరు, నెల్లిమందల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రారెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అలాగే వల్లిగట్లలో పుంగనూరు నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ గన్నా మదన్‌మోహన్‌బాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వ హించారు. నెల్లిమంద మాజీ సర్పంచు హరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పి.శ్రీనివాసులు, శంకర్, సతీశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.


పొలాల్లో బీజేపీ నాయకుల ప్రచారం

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన మారెమ్మ గుడి చైర్మన్ ఆటో జగ్గ, డైరెక్టర్ భాస్కర్

పలమనేరు, ఏప్రిల్17: పలమనేరులో బుధవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి సమక్షంలో ఇద్దరు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పలమనేరు 23వ వార్డులోని మారెమ్మగుడి చైర్మన్, వైసీపీ బూత్ కన్వీనర్ ఆటో జగ్గ, ఆలయ డైరెక్టర్ భాస్కర్ టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి అమరనాథరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పలమనేరు అభివృద్ధి అమరనాథరెడ్డికే సాధ్యమన్న నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు టీడీపీ నాయకులు ఆర్బీసీ కుట్టి, గిరిబాబు, ఖాజా, మదన్ మోహన్, నాగరాజు, క్రిష్ణమూర్తి, శ్రీధర్, మాబాషా, టీఆర్సీకుమార్, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరిస్తా

హమాలీల సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పలమనేరుకు చెందిన హమాలీల సంఘ నాయకులు శంకర్, జయచంద్ర, ఓబుల్‌రాజు, గిరిధర్ తదితరులు అమరనాథరెడ్డిని కలిశారు. హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, కూలి పెంచాలని, బీమా సౌకర్యం కల్పించాలని, స్థానికులకే పనులు కేటాయించాలని, విశ్రాంతి భవనం ఏర్పాటుచేయాలని విన్నవించారు. దీనిపై అమరనాథరెడ్డి స్పందిస్తూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రన్న బీమా తదితరాలు అందేవన్నారు. వైసీపీ వచ్చాక వాటిని ఆపేసిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే తప్పకుండా గత పథకాలు కొనసాగిస్తామన్నారు. వాటితో పాటు స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషిచేస్తానని వారికి హామీనిచ్చారు.

● పలమనేరులోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద బలిజసంఘం నాయకులు నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో మాజీమంత్రి అమరనాథరెడ్డి, టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్బీసీ కుట్టితో పాటు బలిజసంఘం నాయకులు పాల్గొన్నారు.


అమరనాథరెడ్డిని కలిసిన హమాలీలు

టీడీపీలోకి 30 కుటుంబాలు


టీడీపీలో చేరిన కుటుంబాలతో ప్రేమ్‌కుమార్, డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు

కుప్పం, ఏప్రిల్ 17: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన సుమారు 30 కుటుంబాలు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కుప్పం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అర్థమవడంవల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు చేరికల సందర్భంగా గ్రామస్తులు తెలిపారు. చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ తెచ్చేందుకు శాయశక్తులా కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవి, తెలుగు యువత అధ్యక్షుడు బాలు తదితరులు పాల్గొన్నారు. ● కుప్పం రూరల్ మండలం వాలూరు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబుల సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు ఏపీ.రవి, మహేంద్ర, రామచంద్ర, మాజీ ఎంపీపీ సాంబశివం, సర్పంచ్‌లు, రోహిత్, సంతోశ్, ధనశేఖర్, కృష్ణయ్య, యూనిట్ ఇన్‌చార్జిలు తదదితరులు పాల్గొన్నారు.

రామాలయాల్లో మార్మోగిన 'జై శ్రీరామ్'

పుంగనూరు రూరల్, ఏప్రిల్17: శ్రీరామ నవమి వేడుకలను పుంగనూరు పట్టణం, మండల పరిధిలో అత్యంతవైభవంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని నాగపాళ్యం, కట్టకిందపాళ్యం, మార్లపల్లె, అరవపల్లె, హైస్కూల్ వీధిలోని రామాలయాలు, సుబ్బమ్మ చెరువు మొరవలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయాలు జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానాలు, పానకం, మినపపప్పు, మజ్జిగ పంపిణీ చేశారు.

సోమల: సోమల సాయినగర్‌లోని సాయిబాబా ఆలయంలో ఉదయం ప్రత్యేక హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సోమల, కందూరు, పెద్ద ఉప్పరపల్లె, గన్నావారిపల్లె, దిడ్డివారిపల్లె, ఇరికిపెంట, పత్రపల్లె గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు చేశారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల, వంకిరెడ్డిగారిపల్లె, పెద్దగొట్టిగల్లు పెద్దకురవ పల్లె, దద్దాలవారిపల్లె, బుషిరెడ్డిగారిపల్లె ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి.

బైరెడ్డిపల్లె: స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో అర్చకులు తిప్పయ్యాచార్యులు సీతా లక్ష్మణసమేత కోదండ రామస్వామివారి మూల విరాట్‌కు విశేషాలంకరణ గావించి పూజలు జరిపారు. ఈ పూజలకు కొత్తమాచు బద్రి నారాయణ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు.

● శేషాద్రిస్వామి ఆలయం, వి.కోట రహదారిలోని ఆంజనేయ స్వామి ఆలయం, కార్వేటికొండ ధ్యానాభి రామస్వామి ఆలయం, పట్నపల్లె కల్యాణ వెంకట రమణస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు జరిగాయి. ఆలయాల వద్ద భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు.

పలమనేరు: పలమనేరులోని ఆంజనేయస్వామి ఆలయాలు, శ్రీరామమందిరాల్లో స్వామివారికి విశేష పూజలు, అలంకరణలు చేశారు. ● మండలంలోని కొలమాసనపల్లిలో వెలసిన వైకుంఠ రామాలయంలో స్వామివారికి వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామవీధుల్లో ఊరేగించారు. ● పలమనేరు సమీపంలోని విష్ణుపురిలో వెలసిన నిర్వాణ నారాయణస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్ పాల్గొన్నారు.

శాంతిపురం: రాళ్లబూదుగూరులో వెలసిన కోదండరామ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. అలాగే నడింపల్లె, తుమ్మిసి, అప్పయ్యతోట వద్ద గల హనుమాన్ ఆలయాలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిపించారు.

వి.కోట: వి.కోటలోని వీరాంజనేయస్వామి ఆలయంలోని సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి పల్లకీపై పట్టణంలో ఊరేగించారు. ఆలయం ప్రాంగణంలో చిన్నారుల కోలాటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మోట్లపల్లె రామాలయంలో స్వామి వారికి ప్రేత్యక పూజలు నిర్వహించి ఊరేగింపు చేపట్టారు.

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లెలోని కోదండరామస్వామి ఆలయంలో ఉదయం సీత, రామ, లక్ష్మణ, హనుమ మూలవిగ్రహాలకు ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. తర్వాత ఉత్సవర్లకు విశేషఅలంకరణ చేశారు. గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు మండలంలోని టీడీపీ నాయకులు అర్చనలు చేయించారు. రాత్రి ఉత్సవర్లను ముత్యాల పల్లకీలో ఊరేగించారు. సింగసముద్రం వినాయక ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రామకుప్పం పట్టణ శివార్లలోని వేంకటేశ్వరాలయం ఆవరణలో గల హనుమంతుడి విగ్రహానికి ఆలయ నిర్వాహకులు పూజలు చేశారు. మండలంలోని అన్ని రామాలయాలు, అంజనేయస్వామి ఆలయాల్లో ప్రజలు విశేష పూజలు చేశారు.

చౌడేపల్లె: మండలంలోని గడ్డంవారిపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో వెలసిన కమలాంజనేయస్వామి హరిమందిరం, బజార్‌వీధిలోని రామాలయం, బిల్లేరులో సీతారాముల ఆలయం, గోసులకుర్రపల్లెలోని రామాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు.





రొంపిచెర్లలోని రామాలయంలో సీతాకల్యాణం, వి.కోటలో ప్రత్యేక అలంకరణలో సీతారామ సమేత రాముల వారి విగ్రహాలు, పలమనేరు మండలం కొలమాసనపల్లి వైకుంఠరామాలయంలో కల్యాణోత్సవం, బైరెడ్డిపల్లెలో విశేషాలంకరణలో కోదండరాముడు

ఎక్స్‌కవేటర్ , రెండు ట్రాక్టర్లకు జరిమానా



గంగవరం, ఏప్రిల్ 17: మండల పరిధిలోని కౌండిన్య నదీకాలువ నుంచి ఇసుక తరలిస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, రెండు ట్రాక్టర్లను ఎస్‌ఈబీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు, ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.70 వేలు జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే కోర్టుకు అప్పగిస్తామని పలమనేరు ఎస్‌ఈబీ సీఐ సురేష్ రెడ్డి హెచ్చరించారు.

పెద్దపంజాణి ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు, ఏప్రిల్17: పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులును వెంటనే సస్పెండ్ చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెద్దపంజాణి మండలం ముత్తుకూరు చెందిన మొగిలప్ప(65) మద్యం అమ్ముతున్నట్లు తప్పుడు కేసు నమోదు చేసి జైలుకు పంపడంతో ఆయన మృతిచెందాడని ఆరోపించారు. గతంలో కూడా మండలంలోని ఓ దళిత మహిళపై తప్పుడు కేసు నమోదు చేసి రాత్రి వేళ స్టేషన్‌లోనే ఉంచి ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఈ కేసులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో దళిత సంఘనాయకులు నాగరాజ, భాస్కర్, రమేష్, శంకర్ పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

కుప్పం, ఏప్రిల్ 17: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని పెట్రోలు బంకుల వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుప్పం అగ్నిమాపక అధికారి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది రెడ్డెన్న, నరేష్, క్రిష్ణయ్య, సత్య, రఘుపతి పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెట్రోలు బంకుల్లోని సిబ్బందికి అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల్లో సెల్‌ఫోన్ మాట్లాడరాదని, సిగరెట్, బీడీలు తాగరాదని తెలియజేశారు.

నేటి నుంచి ఎస్వీసెట్‌లో సెలెస్టా 2కే24

పుత్తూరు : ముత్తిరేవుల సమీపాన గల శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్ కళాశాలల ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 20 వరకు సెలెస్టా 2కే24 కార్యక్రమం జరుగనున్నట్లు వైస్‌చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపల్ మోహన్‌బాబు తెలిపారు.

వన్నియకుల క్షత్రియ సంఘానికి 3 ఎకరాల భూమి

జీజేఎం చారిటబుల్ ట్రస్ట్ వితరణ




వన్నియకుల క్షత్రియ సంఘానికి భూమి పత్రాలు అందజేస్తున్న గురజాల జగన్మోహన్, కొత్తపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17: వన్నియకుల క్షత్రియుల కోరిక మేరకు 3 ఎకరాల భూమిని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ వితరణ చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. బుధవారం గురజాల నివాసంలో వన్నియకుల క్షత్రియ సంఘం నేతలతో కలసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ తమ సామాజిక వర్గానికి స్థలం కావాలని, అందులో కళ్యాణ మండపం, స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్, వృద్ధాశ్రమం నిర్మించాలని చెప్పారు. తనవంతు సాయంగా తమ ఫౌండేషన్ తరపున 3 ఎకరాల స్థలాన్ని వితరణగా ఇస్తానని హామీ ఇచ్చారు. అలాగే భవన నిర్మాణం కోసం ఫౌండేషన్ తరపున, ప్రభుత్వం తరపున కొంత ఆర్థిక సాయం అందిస్తామని మిగిలిన నిధులను సంఘం తరపున ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అలాగే ఇటీవల మొదలియార్ కులస్తులు కూడా తమకు ప్రత్యేక భవనం కోసం స్థలం కావాలని అడిగారని, వారికి కూడా తమ ఫౌండేషన్ తరపున స్థలం ఇచ్చేందుకు కృషిచేస్తానని చెప్పారు. ఇతర కులసంఘాలు కూడా ఎవరికైనా ఆసక్తి ఉండి ముందుకు వస్తే తమ వంతు సాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నగర అధ్యక్షుడు శంకర్, వన్నియకుల సంఘం నేతలు త్రిమూర్తి, విజయకుమార్, దేవ ఉదయ్ కుమార్, అశోక్, మురుగ పాల్గొన్నారు.

మహిళలకు గుర్తింపు ఇచ్చింది చంద్రబాబే

గుడిపాల : మహిళలకు గుర్తింపునిచ్చి ఓ శక్తిగా ఎదిగేలా చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని వసంతాపురం, కొత్తపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులు అరికట్టాలంటే వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే గుడిపాలలో గార్మెంట్ ఏర్పాటు చేసి స్థానిక మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. మాజీ ఎంపీపీ దీపశ్రీ, మాజీ జడ్పీటీసీ సుమతి, మహిళా నేత ఉదయ, నాయకులు చల్లా, కుమార్, బాబు, మహదేవన్, సెల్వినాథన్, రమేష్, మురళీనాయుడు, అనిల్‌కుమార్, బాబురెడ్డి, దక్షిణామూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్నాటకానికి వడ్డెర్లు చరమగీతం పాడాలి

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17: జగన్నాటకానికి వడ్డెర్లు చరమగీతం పాడాలని వడ్డెర సంఘం నేతలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ వడ్డెర సాధికార సమితి నేతలు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో సీఎం జగన్‌పై జరిగిన గులక రాయి దాడి ఘటనలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను విచారణ పేరుతో పోలీసుల నిర్బంధించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ధరణి ప్రకాష్, చిత్తూరు పార్లమెంటు లీగల్ సెల్ అధికార ప్రతినిధి ముత్యాలు, జిల్లా వడ్డెర సాధికార కమిటీ సభ్యులు అశోక్, మురళి, దామోదరం, మణికంఠ, వెంకటేష్, రుద్రయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

హుండీ పగలగొట్టి నగదు చోరీ

వడమాలపేట, ఏప్రిల్ 17: మండలంలోని ఎస్వీ పురం వడ్డిపల్లిలోని బంగారమ్మ ఆలయంలో రెండు హుండీల్లోని నగదు చోరీకి గురైంది. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బంగారమ్మ ఆలయ ఆవరణలో ఉన్న హుండీని సమీప మామిడి తోపు పరిసరాల్లోకి తీసకుని వెళ్లి, పగలగొట్టి నగదు దోచుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మాంగాడులో యాగాతమ్మ జాతర



నగరి ఏప్రిల్ 17: నగరి మండల పరిధిలోని మాంగాడులో గ్రామ దేవత యాగాతమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. జాతరలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.

నామినేషన్ల కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 17: గంగాధరనెల్లూరులో నామినేషన్ల స్వీకరణ కేంద్రం నుంచి వందమీటర్ల దూరం వరకు నాలుగువైపులా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సి.వెంకటశివ తెలిపారు. బుధవారం తహసీల్దార్ ఆఫీస్‌లో మీడియా సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వ తేది వరకు ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటలలోపు వరకే ఎమ్మెల్యేగా పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్ల దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల రూట్‌మ్యాప్ పరిశీలన

చిత్తూరు, ఏప్రిల్ 17: నగరపాలక పరిధిలో పోలింగ్ కేంద్రాల రూట్‌మ్యాప్‌ను ఏఆర్వో అరుణ బుధవారం పరిశీలించారు. పీవీకేఎన్ కళాశాల నుంచి రూట్ నెంబరు 12ను సంబంధిత సెక్టోరల్ అధికారి, రూట్ ఆఫీసర్, ఎస్‌హెచ్‌వోలతో కలిసి పరిశీలించి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాల కల్పన, ఏర్పాట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఏసీ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో అనిల్‌కుమార్, డీఈలు వెంకటప్రసాద్, రమణ పాల్గొన్నారు.

23న పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశం రద్దు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 17: ఈనెల 23న పాఠశాలల్లో జరగాల్సిన పేరెంట్స్, టీచర్స్ కమిటీ సమావేశం రద్దు చేస్తూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులు డీఈవో కార్యాలయానికి అందాయి. సమ్మేటివ్ అసెస్మెంట్-2 (వార్షిక) పరీక్షలు ఈనెల 19న ముగియనున్నాయి. 20,22 తేదీలలో జవాబు పత్రాలు మూల్యాంకనం, ఆపై 23న ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

నేడు గాలి భానుప్రకాష్ నామినేషన్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 17: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గాలి భానుప్రకాష్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 8.30 గంటలకు నగరి పట్టణం కొత్తపేట వినాయకస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు.

కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ప్రదానం



పురస్కారం అందుకున్న సి.ఎన్ చంద్రశేఖర్

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 17: స్థానిక డిఐ రోడ్డు రాజామహల్ హోటల్‌లో బుధవారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా డా. కె.రామలక్ష్మి తన తల్లి కుప్పంరెడ్డెమ్మ స్మారకార్థం జయంతి, వర్ధంతుల సందర్భంగా కథలు, నవలల పోటీలు నిర్వహిస్తున్నారు. కుప్పం రెడ్డెమ్మ జయంతి సందర్భంగా 2023వ సంవత్సరం కథలు, కథానికలు, కవితల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన నలుగురు విజేతలకు బుధవారం నగదు బహుమతులతోపాటు సత్కరించారు. కథల పోటీలలో సి.ఎన్. చంద్రశేఖర్ రచించిన ఆదివారం కథల సంపుటి, నవలల పోటీలో మురిశెట్టి గోవింద్ రచించిన సుదీర్ఘ స్వప్నం, కవితల పోటీలో కవశ్రీ(శ్రీనివాసులు) రచించిన సమాంతర వాక్యం, చంధోబద్ధ కవిత్వంలో ఆముదాల మురళి రచించిన శతావధాని కౌముది బహుమతులకు ఎంపికయ్యాయి. వీరందరికి సమానంగా రూ. 10 వేలు నగదు పురస్కారంతో పాటు సత్కరించారు. కార్యక్రమంలో ఏఐఆర్ విశ్రాంత ఉద్యోగి వేణుగోపాల్, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, డా. కె. రోజా, డా.నిరంజన్‌రెడ్డి, ఎంఆర్. అరుణకుమారి, హరినాయుడు, సహదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీడీ నెల్లూరులో టీడీపీ జెండా ఎగరాలి

చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు





ఎన్డీఏ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, విజయకేతనం చూపిస్తున్న ప్రసాదరావు, అమరనాథరెడ్డి

పాలసముద్రం, ఏప్రిల్ 17: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయాలని, ఇందుకోసం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి ఐకమత్యంగా పనిచేయాలని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు కోరారు. బుధవారం పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజుపురంలో ఏర్పాటుచేసిన ఎన్డీఏ ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రజల సంక్షేమాన్ని కోరే చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని ఆయన కోరారు. పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ సర్కారు ఐదేళ్ళ పాలనలో ప్రజలు ఎటువంటి పరిణామాలను చవిచూశామో ప్రజలందరికీ తెలుసునన్నారు. జగన్ విషయంలో రాష్ట్ర ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని కోరే ఎన్డీఏ కూటమిని బలపరచాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు సి.రాజన్, రుద్రయ్య నాయుడు, జయశంకర్ నాయుడు, స్వామిదాస్, చెంగల్రాయ యాదవ్, లోకనాథ రెడ్డి, నాయకులు ఇందిరమ్మ, జనార్ధన్ రాజు, బాబు నాయుడు, మిది, గంగాధరనెల్లూరు జనసేన కన్వీనర్ పొన్నా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా కదలిరా..! ఈ సారి విజయం మనదే... నాయకులంతా కలసికట్టుగా పనిచేయాలి....కూటమి అభ్యర్థులదే విజయం' అంటూ చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు, మాజీ మంత్రి అమరనాథరెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్‌పొన్న, మహిళా నాయకురాలు ఇందిర విజయకేతనం చూపించారు. కార్యకర్తలు, నాయకులకు ఉత్తేజం నింపారు. ఇది బుధవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రంలో జరిగిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీ(కూటమి) నాయకుల ఆత్మీయ సమావే శం జరిగింది. ప్రముఖుల విజయకేతం పలువురిని ఆకర్షించింది.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

బంగారుపాళ్యం : మండలంలోని తంబుగానిపల్లి, కొత్తవెంకటాపురం బీసీ కాలనీకి చెందిన మోహన్ నాయుడు, తిరుమల నాయుడు, సుదాకర్ నాయుడు, గోపాల్ నాయుడుల ఆధ్వర్యంలో 10 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో లోకనాథం నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, సురేంద్రనాయుడు, అనిల్, మధు, అరుణ్, మోహన్ పాల్గొన్నారు.

జీజేఎంకు క్రిస్టియన్ల మద్దతు

చిత్తూరు సిటీ : నియోజకవర్గ క్రిస్టియన్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు మద్దతు ప్రకటించారు. బుధవారం బీవీ రెడ్డి కాలనీలోని జీజేఎం కార్యాలయంలో సుమారు 70 మంది క్రిస్టియన్ మత పెద్దలు గురజాల జగన్మోహన్‌ను కలసి మద్దతు ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి గురజాల జగన్మోహన్‌కే సాధ్యమని వారు చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గురజాల జగన్మోహన్, ప్రసాదరావు గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



నింద్రలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, ఏప్రిల్ 17: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నింద్ర మండల టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నింద్ర, దళితవాడ, మిట్టకండ్రిగ ఎస్టీకాలనీ తదితర ప్రాంతాలలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాక్షసపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న తడుకుపేటవాసులు

నగరి : నగరి మండలం తడుకుపేట పంచాయతీకి చెందిన వంశీరాజ్, మోహన్‌రావుల ఆధ్వర్యంలో 25 మంది వైసీపీ నుంచి టీడీపీలో నగరి టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సమక్షంలో చేరారు.

నగరి/విజయపురం : నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గురువారం నామినేషన్ వేయనున్నందున టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలిరావాలని నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ కొత్తపేట వద్ద గల అగరవినాయకస్వామి దేవాలయం నుంచి ర్యాలీగా వెళ్లి నగరి ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వారు తెలిపారు. గాలి భానుప్రకాష్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు పేర్కొన్నారు. బుధవారం కేశవపురంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిది చుక్కా ధనుంజయయాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు



హనుమంతు వాహనంపై స్వామివారు, సీతారాముల కల్యాణం, ప్రత్యేక అలంకరణలో స్వాములు, బసవాపల్లిలో శ్రీరాముడి ఊరేగింపు

కార్వేటినగరం, ఏప్రిల్ 17: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాల స్వామి ఆలయం ఆవరణలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమంతు వాహనంపై స్వామిని ఊరేగించారు. సాయంత్రం కల్యాణోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం సర్వభూపాల వాహనంపై స్వామివారు ఊరేగారు.

పెనుమూరు : మండలంలోని మఠంపల్లిలో హరిబాబునాయుడు ఆధ్వర్యంలో రాములవారి కల్యాణోత్సవం నిర్వహించారు. చిత్తూరు-పెనుమూరు మార్గంలో ఉన్న వాగ్దేవి సవితా సేవాశ్రమంలో ఆశ్రమ అధినేత పూజానంద, హరగోపాల్ నేతృత్వంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తిలకించారు.

పూతలపట్టు : మండలంలోని పేటమిట్ట, పేటపల్లి, పి.కొత్తకోట, ఈసీపల్లి గ్రామాల్లోని రామాలయాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

విజయపురం : మండలంలోని చిన్నఆలపాకం, విజయపురం, జగన్నాథపురంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు జరిగింది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది సుగుణామురళీకిషోర్, కొండూరి అశోకరాజు దంపతులు, రాంప్రసాద్‌శర్మ, మహేష్‌శర్మ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : కుప్పాలపల్లిలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

వెదురుకుప్పం : మండలంలోని పెరుమాళ్లపల్లె, సంతబయలు, గంటావారిపల్లె ప్రాంతాల్లోని ఆలయాల్లో రాముల వారి పటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరి క్షేత్రంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీతారాముల వారి కల్యాణోత్సవం జరిగింది. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

గుడిపాల: మండలంలోని కోలాపూరు, ముట్టుకూరుపల్లి, బసవాపల్లి, పాపసముద్రం, ఏఎల్‌పురం, 197 రామాపురం, నంగమంగళం, రామభద్రాపురం గ్రామాల్లో శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసవాపల్లిలో ఉత్సవవిగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్ళారు.

శ్రీరంగరాజపురం : ఎస్ఆర్‌పురం మండలం సింధురాజపురంలో వెలసిన అభయాంజనేయస్వామికి శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముడి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

పుత్తూరు టౌన్ : తడుకు పంచాయితీ తిమ్మరాజుకండ్రిగలోని సీతారాముల ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అన్నదానం చేశారు.

వడమాలపేట : ఏఎం పురంలోని రామాలయంలో సీతారాముల ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు.

రమణీయంగా సీతారామ కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో కలెక్టర్, ఎస్పీ, జేసీ, ఏఎస్పీలు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పండుగ సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవాలు రమణీయంగా జరిగాయి, గిరింపేట వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం స్వామికి కల్యాణోత్సవం నిర్వహించారు. అదేవిధంగా తోటపాళ్యం సీతారామభజన మందరిం, దొడ్డిపల్లె సీతారామభజన మందిరం, రంగచారి వీధి, మిట్టూరు రాగిమాను వీధి, నీవానది రాజుగుడి, కట్టమంచి వరదరాజస్వామి, పెనుమూరుక్రాస్ వాగ్దేవి, ప్రశాంత్‌నగర్ కాలని వరాహి, సంతపేట శ్రీరంగనాథ, గిరింపేట బొందువీధి వెంకటేశ్వర, దుర్గానగర్‌కాలని సర్వసిద్ధి, గొడుగుమూరు, కొంగారెడ్డి ఎట్టిమ్మగుడి, కట్టమంచి షిర్డిసాయి భజనమందిరాల్లో శ్రీరామనవమి పండుగతో పాటు సీతారామ కల్యాణోత్సవాలు జరిగాయి.

వైభవంగా గరుడవాహన సేవ

స్థానిక కోదండరామాలయంలో బుధవారం శ్రీరామనవమి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడవాహనంపై అధిష్ఠించి పురవీధులలో భక్తులకు దర్శనం కల్పించారు. గరుడవాహనం నాయుడు బంగ్లా వద్దకు రాగా ఉభయదారులు వెంకటేశ్వర,చౌదరి, వెంకట్‌ల కుటుంబ సభ్యులు పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక అశోకపురం పోలీస్ టాప్ లైన్‌లోని రామభజనమందిరంలో ఎస్పీ వి.మణికంఠచందోలు ఆధ్వర్యంలో కలెక్టర్ షన్మోహన్ సగిలి ముఖ్య అతిథిగా శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది.

ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 17: ఉద్యోగ, కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఎన్జీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారులు కార్మిక సంఘాల జెండాల స్తంభాలపై తెల్ల పెయింట్ వేయడం అన్యాయమన్నారు. మేడే ఉత్సవాలకు ఎన్నికల అధికారులు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు గోపీనాథ్, మణి, సత్యమూర్తి, చంద్ర, ఆర్ముగం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో తిరుపతి కలెక్టర్

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 17:: తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

టీడీపీ నేతల కొబ్బరి చెట్లకు నిప్పు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 17: నగరంలోని మురకంబట్టు అగ్రహారంలో 40వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఎంవీ రమణ, డివిజన్ అధ్యక్షుడు ఎంవీ శ్రీమన్నారాయణలకు చెందిన కొబ్బరి చెట్లకు బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ అధికారులు చేరుకుని మంటలు అదుపుచేశారు. సుమారు 35 కొబ్బరి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి బాధితులు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్వీ పురంలో టీడీపీ ప్రచారం

వడమాలపేట, ఏప్రిల్ 17: ఎస్వీ పురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. ప్రచారంలో చిత్తూరు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మునిశేఖర్, నాయకులు ధనంజయులు నాయుడు, వెంకటయ్య, శేషాద్రియాదవ్ పాల్గొన్నారు.

సారా స్వాధీనం : ఒకరి అరెస్టు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 17: ఎస్ఆర్‌పురం మండలం కట్టికపల్లె గ్రామానికి చెందిన చెంగల్‌రాయులు ఇంటి దగ్గర నాటుసారా అమ్ముతుండగా, పోలీసులు దాడి చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. చెంగల్‌రాయుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించామని ఎస్ఐ కుళాయిప్ప తెలిపారు.